క్లుప్తంగా

సింహ వాహనంపై రామచంద్రుని విహారం


పుర వీధుల్లో విహరిస్తున్న రామచంద్రస్వామి

బైరెడ్డిపల్లె: దేవీ శరవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తీర్థం గ్రామంలో సింహ వాహనంపై శ్రీరామచంద్రస్వామి విహరించారు. బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలోని శ్రీ సల్లాపురెమ్మ, బాటగంగమ్మ, శ్రీవాసవీ మాత ఆలయాల్లో అమ్మవారు బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈఓపీఆర్డీగా గోపాల ప్రసాద్

బైరెడ్డిపల్లె: ఈఓపీఆర్డీగా తిరుమల గోపాల ప్రసాద్ సోమవారంబాధ్యతలు స్వీకరించారు. గంగవరం మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓపీఆర్డీ రాజేంద్ర బాలాజీని పలమనేరుకు బదిలీ చేశారు.

ర్యాలీకి అనుమతివ్వాలని వినతి


ఏఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న రమణారెడ్డి

చౌడేపల్లె: చౌడేపల్లెలోని బోయకొండ ఆర్చి నుంచి బోయకొండ ఆలయం వరకు ర్యాలీ నిర్వహణకు అనుమతించాలని కోరుతూ ఆలయ మాజీ చైర్మన్ ఎస్కె రమణారెడ్డి సోమవారం ఏఎస్ఐ వాసుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి సొంత ఖర్చులతో కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించడానికి మంగళవారం ఉదయం 10 గంటలకు వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, పురుషోత్తం, సోముశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఓగా హరిబాబు



సదుం: మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా హరిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేణిగుంట నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌గా వెంకటరమణమ్మ బాధ్యతలు స్వీకరించారు.

పలువురు అధికారుల బదిలీ

రొంపిచెర్ల: మండలంలో పని చేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఈఓ ఆర్డీ రాజేంద్ర నగరికి, సీనియర్ అసిస్టెంట్ పార్వతీష్ కేవీ పల్లెకు, టైపిస్ట్ శేఖర్, జూనియర్ అసిస్టెంట్ శేషాద్రి పులిచెర్లకు, రొంపిచెర్ల పంచాయతీ ఈఓ నాగరాజ కల్లూరుకు, బొమ్మయ్యగారిపల్లె కార్యదర్శి హరినాథ్ బండకింద పల్లె గ్రామ పంచాయతీకి, చిచ్చిలివారిపల్లె కార్యదర్శి శివకేశవ్ గానుగచింతకు, బోడిపాటివారిపల్లె కార్యదర్శి శేఖర్‌రెడ్డి రొంపిచెర్ల–3 సచివాలయానికి బదిలీ అయ్యారు.

రామరాజు సేవలు మరువలేనివి


రామరాజును సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు: సముద్రపల్లె పంచాయతీ కార్యదర్శి రామరాజు సేవలు మరువలేనివని, కోవిడ్‌లో ఆయన ఉత్తమ సేవలనందించారని గ్రామ సర్పంచ్ తిరుమలేష్ కొనియాడారు. బదిలీ సందర్భంగా స్థానిక సచివాలయంలో సోమవారం సచివాలయ సిబ్బంది ఆయనను సన్మానించి వీడ్కోలు పలికారు. సచివాలయ సిబ్బంది మురళీనాథ్, ప్రకాష్, కిశోర్, ప్రియదర్శిని, జ్యోత్స్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి కిక్ పాలసీ..!

మద్యం టెండర్ల విషయంలో కూటమి నాయకులు వేసిన స్కెచ్‌కు అందరూ నోరెళ్లబెడుతున్నారు. తాము నిర్ణయించిన వారు మాత్రమే సిండికేట్‌గా మద్యం టెండర్లు వేయాలని స్థానిక పార్టీ పెద్దలు నిర్ణయించినట్టు తెలిసింది. తమను సంప్రదించకుండా టెండర్లు వేసి షాపు దక్కించుకుంటే ఇబ్బందులు తప్పవని ఆయా మండలాల నేతల నుంచి ఆశావహులకు హెచ్చరికలు, బెదిరింపులు వస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా డిపాజిట్ కట్టినా షాపు దక్కని వారు బెల్ట్ షాపు పెట్టుకోవచ్చని బంపర్ ఆఫర్ ఇస్తుండడంతో ఈ మద్యం టెండర్ల యవ్వారం కూటమి నాయకుల్లో చిచ్చు రేపుతోంది.


మద్యం బాటిళ్లు

- తాము చెప్పినోళ్లే టెండర్లు వేయాలట!
- మండలానికి 20 మందికే అవకాశం
- వారిలో ఎవరికి షాపులొచ్చినా రానివారిని అండ
- డిపాజిట్ కట్టినా షాపు రాని వారికి బెల్ట్ షాపట..!
- ఇదీ పలమనేరు నియోజకవర్గంలో నేతల అజెండా
- కూటమి నాయకుల్లో చిచ్చు రేపుతున్న మద్యం టెండర్లు

పలమనేరు: పలమనేరు ఎక్సైజ్‌శాఖ పరిధిలోని ఐదు మండలాల్లో 13 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో దరఖాస్తులను ఆహ్వానించారు. అధికారంలోకి కూటమి నేతలు సైతం ఎలాగైనా వీటిని దక్కించుకోవాలని పలువురు రంగంలోకి దిగారు. అయితే ఎక్కువమంది ఒక్కోషాపు కోసం రూ.2లక్షలు చెల్లిస్తే అది నాన్–రీఫండ్ కాబట్టి ప్రభుత్వానికి భారీగా ఆదాయం లభిస్తుందని చంద్రబాబు సర్కార్ భావించింది. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయింది. కూటమి పెద్దలు కలిసి ఆయా మండల ఇన్‌చార్జ్‌లు సూచించిన 20మంది మాత్రమే సిండికేట్‌గా షాపులకు దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో కొందరికి బినామీలుగా ఇంకొందరు డిపాజిట్ కట్టేందుకు సిద్ధమయ్యారు. 20మందిలో ఆయా మండలానికి సంబంధించిన షాపులు దక్కిన తరావత మిగిలిన వారిని సిండికేట్‌లో చేర్చుకోవడం లేదా కొందరికి బెల్టుషాపులు దక్కేలా మాట్లాడుకున్నట్టు తెలిసింది.

కూటమిలో మొదలైన చిచ్చు

18 ఏళ్లు నిండిన వారు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధనల్లో సూచించింది. కానీ ఇక్కడి నేతలు ఈ వ్యవహారాన్ని తమ గుప్పిట్లోకి తీసుకొని కొత్త పాలసీని పెట్టుకున్నారు. ఆయా మండలంలో కేవలం 20మంది మాత్రమే దరఖాస్తు చేసుకుంటే.. తాము కూడా పార్టీకోసం కష్టపడ్డామని తామెందుకు దరఖాస్తు చేయరాదని మరికొందరు ఆశావాహులు ఆగ్రహంతో ఉన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి తేల్చుకుందామనే రీతిలో మాట్లాడుతున్నారు. అలాకాదంటే తాము కూడా టెండర్లేస్తామని ప్రకటించడంతో ఇది కాస్తా కూటమి నేతల చిచ్చు రేపుతోంది.

అలిగినవారికి బెల్టు షాపులట..!

ఇలా ఉండగా మద్యం షాపులకు డిపాజిట్ చెల్లించి దరఖాస్తు చేసుకొన్న వారిలో ఎవరికి షాపువచ్చినా మరో నలుగురిని భాగస్వాములుగా చేసుకోవాలని ఇప్పటికే పెద్ద నాయకులు దిశా నిర్దేశం చేసినట్టు సమాచారం. దీంతో ఒక్కోషాపుకు కట్టే డిపాజిట్‌ను సైతం నలుగురు కలిసి రూ.50 వేలు చొప్పున రూ.2లక్షలను ఒక్కరి పేరిటే వేస్తున్నట్టు తెలిసింది. ఇంతేకాకుండా ఇందులో షాపులు రానివారికి, లేదా తనకు మద్యం దుకాణం ఇవ్వలేదని అలిగిన వారికి ఆయా గ్రామాల్లో బెల్టుషాపుల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తానికి ఈ వ్యవహారంలో కూటమి నేతలు మద్యం టెండర్ల విషయంలో తమదైన పక్కా అజెండాతో ముందుకెళ్తున్నట్టు ఇక్కడి పరిస్థితులు చెబుతున్నాయి.

గ్రహస్థితి బాగున్న వారిచేతనే దరఖాస్తు!

సిండికేట్ అయిన కూటమి నాయకులు ఆ నలుగురిలో ఎవరికైతే గ్రహస్థితి బాగుంటుందో వారిచేతనే దరఖాస్తు చేయిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం వారి జాతకాలు, ప్రస్తుత గ్రహబలాలు, ఏ రాశిలో వారికి టైం బాగుందో జ్యోతిష్యుల వద్ద చూపించుకుని మరీ దరఖాస్తులు చేస్తుండడం కొసమెరుపు!

ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు

పలమనేరు ఎక్సైజ్ పరిధిలోని 13 ప్రైవేటు దుకాణాలకు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. మీ–సేవ కేంద్రాలు, నెట్ సెంటర్లలో లేదా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:/హెచ్‌పీఎఫ్ఎస్‌ప్రాజెక్ట్.కామ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏవైనా సందేహాలున్న పక్షంలో 040-42425520 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అధికారులేమో మద్య షాపుల వ్యవహారం పారదర్శకంగా సాగుతున్నట్టు చెబుతున్నా కూటమి నేతల కనుసన్నల్లోనే మొత్తం వ్యవహారాలు సాగుతుండడం గమనార్హం!

మాన్యం భూములను సర్వే చేయండి


గోసలకురప్పల్లెలో కాశీ విశ్వేశ్వరస్వామి మాన్యం భూములను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఏసీ

- ఆక్రమణ స్థలాలను పరిశీలించిన దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ
- వారంలో నివేదిక ఇవ్వాలని ఈఓకు ఆదేశం

చౌడేపల్లె: మండల కేంద్రంలో గోసలకురప్పల్లె సమీపంలోని శ్రీకాశీవిశేశ్వరస్వామి, శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం మాన్యం భూములను సర్వే చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని దేవదాయశాఖ ఏసీ చిట్టెమ్మ ఈఓ కమలాకర్‌ను ఆదేశించారు. సోమవారం ఆమె కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల్లో ఆక్రమణదారులతో మాట్లాడారు. కొన్నేళ్లుగా 39 మందికి సంబంధించి ట్రిబ్యునల్ కోర్టులో కేసు నడుస్తోందని ఈఓ కమలాకర్ ఏసీకి వివరించారు. మరి కొందరు ఆక్రమించారని, వాటిని తాత్కాలికంగా తొలగించినట్లు తెలిపారు. బస్టాండులోని మాన్యం భూముల్లో నిర్మించిన షాపులు, భవనాలను సర్వే చేయాలని ఆమె ఈఓను ఆదేశించారు. మాన్యం భూముల్లో ఏకంగా భవనాలు నిర్మిస్తున్నారని, సేద్యం చేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు.అలాగే శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ నిర్వహించాలని గ్రామస్తులు ఏసీని కోరారు. ఆక్రమణదారుల నుంచి మాన్యం భూములను స్వాధీనం చేసుకోవడంతోపాటు షాపులు, భవనాల నుంచి అద్దె వసూలుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అనంతరం మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ దీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న హక్కుల నాయకులు

పెద్దపంజాణి: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేశారు. జిల్లా నాయకులు డీవీ మునిరత్నం, పార్థసారథి మాట్లాడారు. బెరపల్లెకు చెందిన చాకలి క్రిష్ణప్ప భూమికి హద్దులు చూపాలని ప్రభుత్వానికి చలానా కట్టి సంవత్సరం నుంచి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, అలాగే అప్పినపల్లెకు చెందిన దళిత మహిళ సాలమ్మ భూ సమస్య పరిష్కరించాలని 4 నెలలుగా ప్రదక్షిణలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శీనప్ప, నాగార్జున, సాంబశివ, సుజాత, వెంకటేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


బైరెడ్డిపల్లె: లక్కనపల్లె జెడ్పీ హైస్కూల్లో గురువులను సన్మానించిన పూర్వవిద్యార్థులు

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని లక్కనపల్లె జెడ్పీ హైస్కూల్లో 2008–2009 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుని జ్ఞాపకాల పూదోటలో విహరించారు. దసరా సెలవుల అనంతరం స్కూలుకు తమ వంతు తోడ్పాటునివ్వాలని నిర్ణయించుకున్నారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురుదేవులను సన్మానించి ఆశీస్సులు పొందారు.

అపూర్వ కలయిక


గురుదేవులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ హైస్కూల్లో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1994–95లో 10వ తరగతి చదివిన అప్పటి విద్యార్థుల ఇక్కడ కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ ఉన్నతికి బాటలు వేసిన స్కూలు అభివృద్ధికి తమవంతు సాయంగా రూ.70 వేల విలువ చేసే యూపీఎస్ బ్యాటరీలు అందజేశారు. తమ గురుదేవులు మహమ్మదాలి, శ్రీనివాసులు, ఆనంద, భాస్కర్, దుర్గా దేవసేనలను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు.

విశాఖ ఉక్కు.. తెలుగు ప్రజల హక్కు


ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు

పలమనేరు: విశాఖ ఉక్కు తెలుగువారి హక్కు అని, అలాంటి పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నాయని సీపీఎం, సీపీఐ నాయకులు విమర్శించారు. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను నిరసిస్తూ సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఎం, సీపీఐ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటుకు ధారాదత్తం చేయడమంటే అక్కడి కార్మికుల హక్కులను కాలరాయడమేనన్నారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులు, గిరిధర్‌గుప్త, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే గ్రేడింగ్ బెల్టుల పంపిణీ


పుంగనూరులో కరాటే గ్రేడింగ్‌లు అందుకున్న చిన్నారులు

పుంగనూరు: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన 60 మంది చిన్నారులకు బెల్ట్ గ్రేడింగ్‌లు పంపిణీ చేశారు. పట్టణంలోని పులినాడు కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సదాశివ, శరత్‌కుమార్ ఈ పోటీలు నిర్వహించారు. ఏడుగురికి బ్లాక్‌బెల్టులు, 52 మందికి గ్రీన్‌బెల్టు, ఆరంజ్‌బెల్టు, ఎల్లో బెల్టులు పంపిణీ చేసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు పావని, ఫరుక్, తేజేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల కమ్యుటేషన్ కాలం తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

పలమనేరు: దేశంలోని ఇతర రాష్ట్రాల్లోలాగే పెన్షనర్ల కమ్యుటేషన్ కాలాన్ని 12 ఏళ్లకు తగ్గించాలని అసోసియేసన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో స్థానికశాఖ అధ్యక్షులు రత్నారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అడిషనల్ క్వాంటం శాతాన్ని పునరుద్ధరించాలన్నారు. పెన్షనర్లకు అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ హెల్త్ ఇన్సూరెన్స్ చెల్లుబాటయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, నీట్‌లో జాతీయర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన వెంకటసాత్విక్‌ను అభినందించారు. కార్యక్రమలో క్రిష్ణమూర్తి, గురుమూర్తి, వెంకటక్రిష్ణ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మరాజుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని అమ్మరాజుపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి. మురళి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గర్భవతులు రక్తహీనత సమస్యను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం హరిప్రియ, ఆశా వర్కర్లు రెడ్డెమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.


దుర్గామాత ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

భక్తిప్రపత్తులతో కుంకుమార్చన

వి.కోట: పట్టణంలోని శ్రీ దుర్గామాత, వాసవీ మాత ఆలయాల్లో అమ్మవారు సోమవారం విజయలక్ష్మీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన ఉయ్యాల సేవలో వందలాది మంది మహిళలు లలితా సహస్రనామార్చన, కుంకుమార్చన చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

స్వయం సహాయక సంఘాల మహిళల ధర్నా


వెలుగు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రూపు మహిళలు

- ఇదివరకే ఉన్న సంఘమిత్రనే కొనసాగించాలని డిమాండ్

గంగవరం: తమకు ఇదివరకూ ఉన్న సంఘమిత్రనే తిరిగి కొనసాగించాలంటూ డిమాండ్ చేస్తూ కీలపట్ల వీఓ–3 గ్రూపు మహిళలు స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, తమ గ్రామ సమైఖ్యకు పదేళ్లగా శ్రీనివాసులు సంఘమిత్రగా పని చేశార న్నారు. బ్యాంకు రుణాలు ఇప్పించడం, లోన్లు తిరిగి చెల్లించడంలో తమకు ఎలాంటి సమస్య తలెత్తకుండా బాధ్యతాయుతంగా పని చేశారన్నారు. అలాంటి వ్యక్తిని రాజకీయ కుట్రతో తొలగించారని నిరసన వ్యక్తం చేశారు. గతంలో గ్రామ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి దృష్టికి సమస్యను నివేదించినా పట్టించుకోలేదని, గ్రామ సమైఖ్య తీర్మానం లేకుండా సంఘమిత్రను తొలగించడంపై గత వీఓ సమావేశాల్లో నిలదీసినా వెలుగు సిబ్బంది కుట్రపూరితంగా వ్యవహరించి మరో మహిళను సంఘమిత్రగా నియమించారని మండిపడ్డారు. మండలంలో అన్ని గ్రూపు మహిళల మద్దతు గత సంఘమిత్రకే ఉందని, వెంటనే అతన్ని సంఘమిత్రగా నియమించకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

పాహిమాం మాతా.. పాహిమాం


పార్వతీదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ






పుంగనూరు: విరూపాక్షి మారెమ్మ, ప్రత్యేక అలంకారంలో పార్వతీదేవి, పలమనేరులో..., పెద్దపంజాణి: శివాడిలో..., గంగవరంలో..

- భక్తిప్రపత్తులతో హోమ పూజలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైనశ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా 4వ రోజైన సోమవారం అమ్మవారు ఆదిశక్తి పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఉదయం ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేక పూజలు చేశారు. అనంతరం పట్టు పీతాంబరాలు, పరిమళ భరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో పార్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. వేదపండితులు గోవర్ధనశర్మ, తదితర అర్చక బృందం ఆధ్వర్యంలో ఈఓ ఏకాంబరం, ఉభయదారులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక హోమ పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి శిరీష, రాధాకృష్ణ, శ్రీదేవి, శివశంకర్(చౌడేపల్లె), విమలమ్మ, సంజీవరెడ్డి(బెంగళూరు), సుజాత, రెడ్డెప్ప(సోమల), గుణనేత్ర, గురుప్రసాద్(దేవనహళ్లి), వెంకటమ్మ, మునిశెట్టి,(బెంగళూరు), రాధిక, ఆంజప్ప(తిరుపతి), కోమల, నారాయణ స్వామి(బెంగళూరు), సుగిత, సురేష్(చైన్నై) ఉభయదారులుగా వ్యవహరించారు. గణపతి హోమం, చండీహోమంతో పాటు పూర్ణాహుతి చేశారు.

పార్వతీదేవి అవతారంలో అమ్మవారు

పుంగనూరు: స్థానిక శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే విరూపాక్షి మారెమ్మను జీడిపప్పు, పూలతో అలంకరించి పూజార్చనలు చేశారు. ఏటవాకిలిలోనూ పార్వతీదేవిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

సదుంలో..

సదుం: మండలంలోని జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవీ, రెడ్డివారిపల్లెలో చామంతుల ఎల్లమ్మ, పచ్చార్ల మాకులపల్లె గంగాపురమ్మ ఆలయంలో అభిషేకాలు, పూజలు చేశారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: స్థానిక గ్రామ పంచాయతీలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో సోమవారం కొలువుదీరారు. ఆలయ అర్చకులు శెట్టిపల్లె గుణశేఖర్ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి, నిత్య పూజార్చన కైంకర్యాలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయదారులుగా రాజేంద్ర, లత దంపతులు వ్యవహరించారు.

మహాచండీ అలంకారంలో దుర్గాదేవి

పలమనేరు: స్థానిక పాతపేటలోని కనకదుర్గ ఆలయంలో సోమవారం దుర్గాదేవి మహాచండీ అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గజలక్ష్మి అలంకరణలో మలాలమ్మ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీమలాలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో సోమవారం అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయం వద్ద అన్నదానం చేశారు.

మహా చండీదేవిగా కాళికాదేవి

పెద్దపంజాణి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు సోమవారం మండలంలోని శివాడిలో కాళికాదేవిమహాచండీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివాడికి చెందిన గౌరమ్మ, వెంకటేష్, శ్రీనివాసులు, గాయత్రి తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వన భోజన సందడి

గుడుపల్లె: మండలంలోని బెగ్గిలిపల్లె గ్రామ సమీపంలోని మల్లప్పకొండపై ఉన్న బసవ మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులు వనభోజన కార్యక్రమంతో సందడి చేశారు. ఆలయం చుట్టు పక్కల ఉన్న బెగ్గిలిపల్లె, నల్లగాంపల్లె, గోకర్లపల్లె, బండకొత్తూరు తదితర గ్రామాల భక్తులు తొలుత మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఉన్న రాతి బండలపై అన్న ప్రసాదాలను వడ్డించి సామూహికంగా భోజనం చేయడం, ఆ తర్వాత పక్కే కొలనులోని నీటిని తాగడం ఆనవాయితీ. కొన్నేళ్లుగా ఆకులు, తట్టలు లేకుండా బండపైనే భోజనం చేయడం ఒక సంప్రదాయంగా పాటిస్తున్నారు. ఇలా చేస్తే వర్షం కురుస్తుందని వారి నమ్మకం.


మల్లప్పకొండపై బండలపై భోజనం తింటున్న భక్తులు